## ఏజిపిగా నియమితులైన రఫియోద్దీన్‌కు సత్కారం



రఫియోద్దీన్‌ను సన్మానిస్తున్న దృశ్యం

**సిద్దిపేట అర్బన్, అక్టోబరు11, (ప్రభాతవార్త):** సిద్దిపేట కోర్టు ప్రభుత్వ న్యాయవాదిగా (ఏజిపి) నియమితులైన రఫియోద్దీన్‌ను సిద్దిపేటలోని కాంగ్రెస్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరి కృష్ణ ఆధ్వర్యంలో సత్కారం చేశారు. రఫియో ద్దీన్‌కు ప్రభుత్వ ఉత్తర్వుల జీవో కాపిని అందజే శారు. ప్రభుత్వానికి, కక్షిదారులకు వారధిగా ఉండి న్యాయం అందేలా కృషి చేయాలని హరి కృష్ణ కోరారు. ఏజిపి పదవి రావడానికి సహ కరించిన సిఎం రేవంత్‌రెడ్డి, జిల్లా ఇంచార్జి మంత్రి కొండా సురేఖ, నియోజకవర్గ ఇంచార్జి హరికృష్ణకు రఫియోద్దీన్ కృతజ్ఞతలు తెలిపారు.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త

## సిద్దిపేటలో దసరా ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** సిద్దిపేట జిల్లాలో దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించడానికి తగు ఏర్పాట్లు చేశారు. ఈ సంద ర్భంగా రావణ దహనానికి ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలోని హనుమాన్ దేవాలయాల వద్ద దసరా పండగ సందర్భంగా పకడ్బందీ ఏర్పాట్లను పూర్తి చేశారు. జిల్లా కేంద్రంలోని 2వ వార్డు నర్సాపూర్‌లో, 3వ వార్డు రంగధాంపల్లి, రూరల్ పోలీసుస్టేషన్ సమీపంలోని హనుమాన్ దేవాలయాల వద్ద ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగు ఏర్పాట్లు చేశారు. అలాగే రంగధాంపల్లి చౌరస్తా వద్ద రావణ దహనానికి ఏర్పాట్లు చేశారు. ఆయా దేవాలయాల వద్ద లైటింగ్, తాగునీటి సౌకర్యాలతో పాటు పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. దసరా ఏర్పాట్లను ఏసీపీ మధు, త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్, ఆయా వార్డుల కౌన్సిలర్లు నాయిని చంద్రం, వంగ రేణుక తిరుమల్‌రెడ్డి, ట్రాఫిక్ ఎస్ఐ గోపాల్‌రెడ్డి పరిశీలించారు. దసరా పండుగ సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు నాయిని చంద్రం, తదితరులు ఉన్నారు.



పొడిచాన్పల్లి పిహెచ్‌సిని తనిఖీ చేస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

## పిహెచ్‌సిని తనిఖీ చేసిన కలెక్టర్ రాహుల్‌రాజ్

**పాపన్నపేట, అక్టోబరు 11, ప్రభాతవార్త:** మండల పరిధిలోని పొడి చాన్పల్లి గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని రికార్డులను, రక్త పరీక్షలు చేసే గదిని, మందులు అందచేసే గదిని, ఇన్ పేషంట్ వార్డు బెడ్స్‌లను, టాయిలెట్స్, వాక్సినేషన్‌ను, పరిసరాలను కలెక్టర్ పరిశీలించారు. ఆసుపత్రికి నిత్యం వచ్చే రోగుల సంఖ్యల ఎంత వరకు ఉంటుందని, అక్టోబరు మాసంలో డెలివరీల లక్ష్యం ఎంత అని, ఇప్పటి వరకు నిర్వహించిన డెలివరీలు ఎన్ని అన్న విషయాలను కలెక్టర్ వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ రోగులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలన్నారు.

## ప్రజలకు దసరా పండుగ శుభాకాంక్షలు

### మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**

విజయ దశమి(దసరా) పర్వదినం సందర్భంగా జిల్లా ప్రజలకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ ప్రజలకు అన్నింటా శుభం చేకూరాలని..ప్రజల జీవితంలో దసరాను మించిన పండుగ లేద న్నారు. దసరా పండుగలో సాంప్రదాయం, సంస్కృతితోపాటు ఆత్మీ యత ఉందన్నారు. దసరా పర్వదినాన్ని ప్రజలందరూ సుఖసంతోషాల తో ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని అకాంక్షించారు. చెడు ఎంత శక్తి వంతంగా కనిపిస్తున్నప్పటికీ మంచితనమే చివరికి విజయం సాధిస్తుం దని ఇదే దసరా మనకు గుర్తు చేస్తుందన్నారు. చెడు మీద మంచి విజయం సాధించే రోజు విజయదశమి అన్నారు. పాలపిట్టను చూస్తే శుభం కలిగినట్టే ప్రజలకు శుభం కలగాలన్నారు. అమ్మవారి అశీస్సులు ప్రజలపై ఉండాల న్నారు. దసరా పండుగ ప్రజలకు మరిన్ని విజయాలు అందించాలన్నారు.

**నియోజకవర్గ ప్రజలకు దసరా శుభాకాంక్షలు: హరికృష్ణ**

దసరా పండుగ పర్వదినం సందర్భంగా సిద్దిపేట నియోజకవర్గ ప్రజ లకు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ దసరా ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులు నింపా ల న్నారు. దుర్గామాత కృపకటాక్షాలు ప్రజలపై ఉండి శుభం కలగాలన్నారు.

## ఇంటిగ్రేటెడ్ స్కూల్ భవన స్థలానికి హద్దులు

### -అదనపు కలెక్టర్ చంద్రశేఖర్



ఇంటిగ్రేటెడ్ స్కూల్ భవన నిర్మాణానికి స్థలానికి హద్దులు బిగింపచేయిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

**పుల్‌కల్, అక్టోబరు 11, ప్రభాతవార్త:** ఇంటిగ్రేటెడ్ స్కూల్ భవన నిర్మాణానికి మండల పరిధిలోని బస్వాపూర్ గ్రామంలో అవసరమైన స్థలాన్ని శుక్రవారం అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ పరిశీలించి హద్దులు బిగింపచేయించారు. గ్రామ శివారులోని సర్వేనంబర్ 417లో 4 దశా బ్దాల క్రితం సింగూరు ప్రాజెక్టు నిర్మాణం దృష్ట్యా నీటి పారుదల శాఖకు కేటాయించారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్ భవన నిర్మాణానికి 25 ఎకరాలు అవసరం కావడంతో నీటి పారుదల శాఖకు కేటాయించిన స్థలాన్ని స్కూల్ నిర్మాణానికి ఉపయోగించుకోవాలని అధికారులు నిర్ణయించారు. సదరు ప్రభుత్వ భూమిని రైతులకు ఎవరికైనా కేటాయించారా. ఏమైన ఇబ్బందులు ఉన్నాయా అని అదనపు కలెక్టర్ తహసీల్దార్ కృష్ణను అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే రాష్ట్ర మంత్రి దామోదర్ రాజనర్సింహా భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారని అదనపు కలెక్టర్ వివరించారు. భవన నిర్మాణానికి భూమి పూజ కొరకు స్థలాన్ని చదును చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భూమి పూజ సంద ర్భంగా నిర్వహించే సభకు అవసరమైన ఏర్పాట్లు త్వరిత గతిన పూర్తి చేసుకోవాలని అధికారులకు సూచించారు. 25 ఎకరాల భూమి చుట్టూ వెంటనే కంచెను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. నీటి పారుదల శాఖ అధికారుల నుంచి స్థలానికి సంబంధించి ఎన్‌ఓసి తీసు కోవాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ సంబంధిత అధికారులకు సూచిం చారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణ, ఆర్‌అండ్‌బి డీఈఈ రవీందర్, రెవిన్యూ ఇన్స్‌పెక్టర్ దావుద్, సర్వేయర్ సునీత తదితరులు ఉన్నారు.

## అమ్మవారికి కుంకుమ పూజ

**హుస్నాబాద్ టౌన్, అక్టోబరు 11, ప్రభాతవార్త :** పట్టణంలోని పోచమ్మవాడ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దేవినవరాత్రి ఉత్సవా ల్లో భాగంగా శుక్రవారం అమ్మవారికి కౌన్సిలర్ బోజు రమాదేవి రవీందర్ ఆధ్వర్యంలో ప్రత్యేక కుంకుమ పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ రమాదేవి మాట్లాడుతూ ప్రజలు సుఖ సంతో షాలతో, వర్ధిల్లాలని వేడుకున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో బోజు సుధారాణి, తిరుమల, కాంతవ్వ, లక్ష్మీ, వాణి, రాధిక, అనిత, శ్రీలత, అంజలి, చందన తదితరులు పాల్గొన్నారు.

## హుస్నాబాద్‌లో ఘనంగా అమ్మవారి పల్లకి సేవ

**హుస్నాబాద్ టౌన్, అక్టోబరు 11, ప్రభాతవార్త :** శ్రీదుర్గాదేవి నవ రాత్రుల సందర్భంగా హుస్నాబాద్‌లో భవాని దీక్ష స్వాముల ఆధ్వర్యం లో శ్రీకనకదుర్గ అమ్మవారిని జ్యోతినగర్‌లో గల శ్రీ లక్ష్మీగణపతి ఉత్సవ కమిటీ అమ్మవారికి మండపం నుండి ప్రారంభించి గాంధీ చౌక్, మల్లెచెట్టు, అంబేద్కర్ చౌరస్తా మీదుగా అంగరంగ వైభవంగా ఊరే గింపు చేసి ఆర్యవైశ్య భవనంలో పల్లకి సేవను ముగించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భవాని దీక్ష స్వాములు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇంటిగ్రేటెడ్ పాఠశాలలో నాణ్యమైన విద్య

### రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**కోహెడ, అక్టోబరు 11, ప్రభాతవార్త :** హుస్నాబాద్ నియోజకవర్గాన్ని అన్ని రంగాలతో పాటు విద్యారంగంలో మరింత ముందుకు వెళ్లేం దుకు కృషి చేయడం జరుగుతుందని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ అన్నారు. సిద్దిపేట జిల్లా కోహెడ మండల పరిధిలోని తంగళ్లపల్లిలో రూ.180 కోట్లతో నిర్మించ తలపెట్టిన ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటిగ్రేటెడ్ పాఠశాలలో వసతి సౌకర్యాలతో పాటు నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలోని 28 నియోజకవర్గాలలో పాఠశాలల నిర్మాణానికి భూమిపూజ చేయాలని సిఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సిఎంలు నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. విద్యా, వైద్యం, టూరిజం, పరిశ్రమలు, వ్యవసాయం, ఉపాధి కల్పనపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. జీవో 190తో నాలుగు గురు కులాలు ఒకే కాంప్లెక్స్‌గా విద్యను అంతర్జాతీయ స్థాయిలో తీసుకెళ్లడానికి ఏర్పాట్లు చేయడం జరుగు తుందన్నారు. నాల్గో తరగతి నుంచి ఇంటర్ వరకు ఈ పాఠశాలలోనే చదువుకునేలా వసతులు కల్పిం చడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో 25 వేల పాఠశాలలకు రూ.1100 కోట్లతో మౌలిక వసతులు కల్పించడం జరిగిందని తెలిపారు. దశాబ్ధాలుగా ఎదురు చూస్తున్న ఉపాధ్యాయులకు 19 వేల పదో న్నత్తులు, 35 వేల బదిలీలు చేపట్టడం జరిగిందని చెప్పారు. బస్వాపూర్‌లో కృషి విజ్ఞాన కేంద్రానికి స్థల పరిశీలన చేశామన్నారు. మొదటి దశలో హుస్నాబాద్, కోడంగల్, మదిరా, మంథని, హుజూర్ నగర్, ములుగు,ఖమ్మం, మానకొండూరులో శంకు స్థాపన చేయడం జరుగుతుందన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ కాంప్లెక్స్‌లకు గ్రీన్ ఎనర్జీతో సొంతంగా విద్యుత్‌ను ఉత్పత్తి చేసు కునేలా చేశామని తెలిపారు. ఒక్కో పాఠశాలలో 25 60 మంది విద్యార్థులు, 120 మంది ఉపాధ్యాయు లతో సకల సౌకర్యాలు కల్పించడం జరుగుతుంద న్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ శ్రీని వాస్‌రెడ్డి, ఆర్డీఓ, తహసీల్దార్ సురేఖ, కాంగ్రెస్ పార్టీ నాయకులు మంద ధర్మయ్య, బస్వరాజు శంకర్, బాలకిషన్, వెంకటస్వామి, రఫీ, చింతకింది శంకర్, దూలం శ్రీనివాస్, రాచూరి శ్రీనివాస్, వివిధ గ్రామాల పార్టీ నాయకులు పాల్గొన్నారు.



ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

# కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీలో రసాభాస

### 79 మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

**వెల్దుర్తి, అక్టోబర్ 11 ప్రభాతవార్త:** ఉమ్మడి మం డలానికి చెందిన 79 మంది లబ్ధిదారులకు నర్సా పూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి కళ్యాణలక్ష్మి చెక్కు లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలతో అధికారంలోకి వచ్చినా అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. ఇప్పటి వరకు మహాలక్ష్మి, రైతు భరోసా పథకాలు అమలు చేయలేదన్నారు. కళ్యాణలక్ష్మి పథకంలో లక్ష రూపా యలతో పాటు తులం బంగారం ఇస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చిన తరువాత అమలు చేయడం లేదన్నారు. దీంతో కాంగ్రెస్ నాయకులు ఒక్కసారిగా ఎమ్మెల్యే డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీకి వచ్చిన ఎమ్మెల్యే ప్రభుత్వానికి వ్యతిరేకం గా మాట్లాడొద్దని కాంగ్రెస్ జిల్లా నాయకులు నరేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మహేష్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు నరసింహారెడ్డి పలువురు కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే డౌన్ డౌన్ అంటూ నినా దాలు చేశారు. దీంతో బీఆర్ఎస్ నాయకులు ఆరు గ్యారెంటీల అమలులో ప్రభుత్వం విఫలమైందని సిఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. దీంతో కళ్యాణలక్ష్మి చెక్కుల పంపిణీలో రసాభసా చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న పోలీసులు ఎంపీడీవో కార్యాలయానికి చేరుకొని ఇరు వర్గాలను సముదాయించారు. ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు గడుస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని, ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని ఎమ్మెల్యే సునితాలక్ష్మారెడ్డి అన్నారు.



వాగ్వాదానికి దిగిన బిఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు

**కాంగ్రెస్ నాయకుల దౌర్జన్యం సరికాదు...**

నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి మాట్లా డుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలుచేయాలని ప్రజలకు వివరిస్తుండగా మధ్య లో కాంగ్రెస్ నాయకులు దౌర్జన్యంగా మాట్లాడుతూ గూండాగిరీ చేయడం సరికాదన్నారు. ఇప్పటికైనా వారి పద్ధతి మార్చుకోవాలని, ప్రొటోకాల్ ప్రకారమే సమావేశాలు నిర్వహించాలన్నారు. ప్రతిసారి ఇలా చేస్తే బిఆర్ఎస్ నాయకులు ఊరుకోరని ఆమె హెచ్చరించారు.

**వివాదాస్పద మాటలు మానుకోవాలి...**

స్థానిక ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి కాంగ్రెస్ ప్రభు త్వంపై వివిదాస్పదమైన మాటలు మానుకోవాలని కాంగ్రెస్ నాయకులు అన్నారు. ప్రభుత్వం ఏర్పడి నప్పటి నుండి ఉచిత్ కరెంట్, ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం, రుణమాఫీచేయడం జరిగిందని, అయినప్పటికీ ప్రభుత్వంపై లేనిపోని ఆరోపణలు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు తాజా మాజీ జెడ్పీటీసీ రమేష్‌గౌడ్, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్, మండల పార్టీ అధ్యక్షులు భూపాల్‌రెడ్డి, ఎంపీటీసీ మోహన్‌రెడ్డి, నాయకులు అశోక్‌గౌడ్, ప్రతాప్‌రెడ్డి, సత్యనారాయణ, కిష్టయ్య, శ్రీనివాస్, శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు నరేందర్‌రెడ్డి, మహేష్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ సుధాకర్‌గౌడ్, నాయకులు మల్లేశం, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

### సాయుధ దళ కార్యాలయంలో

## ఘనంగా ఆయుధపూజ

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**

సిద్దిపేట పోలీసు కమిషనరేట్ పెద్దకోదూరు గ్రామ శివారులోని సాయుధ దళాల కార్యాలయంలో సీపీ డాక్టర్ అనురాధ శుక్రవారం దుర్గదేవి అమ్మవారి నవరాత్రోత్సవాలలో భాగంగా ఆయుధాలకు, ప్రభుత్వ వాహనాలకు వేదమం త్రాలతో శాస్త్రోక్తంగా పూజలు చేశారు. ఈ సందర్భంగా సీపీ డాక్టర్ అనురాధ మాట్లాడుతూ చేసే ప్రతి పనిలో అధికారులు, సిబ్బంది విజయం సాధించాలని ప్రజలకు మరింత మెరుగైనసేవలు అందించాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ లో నేరాలు నియంత్రించడంలో పోలీసుశాఖ ముందంజలో ఉండాలన్నారు. దుర్గమాత కరుణా కటాక్షాలు జిల్లా పోలీసులకు ఎల్లవేళలా ఉండాలని అకాం క్షిస్తూ పూజలు నిర్వహించినట్లు తెలిపారు. చెడుపై మంచి సాధించిన విజయా నికి గుర్తుగా విజయదశమి పండుగను జరుపుకోవడం అలనాటి నుంచి వస్తున్న సంప్రదాయం సమాజంలో చెడును పారదోలెందుకు పోలీసు విభాగం నిరం తరం కృషి చేస్తుందన్నారు. పోలీసు అధికారులకు, సిబ్బందికి, ప్రజలకు దసరా శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పోలీసు అధకారులు, సిబ్బంది రాం చంద్రరావు, సుభాష్‌చంద్రబోస్, మధు, ధరణికుమార్, పూర్ణచందర్, ప్రసాద్, రాజేష్, విష్ణుప్రసాద్, రోహిత్, రంజిత్, బాలకృష్ణ, అంజయ్య, బాలకృష్ణ, సాయుధ దళ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.



సాయుధ దళ కార్యాలయంలో ఆయుధపూజ చేస్తున్న సీపీ డాక్టర్ అనురాధ

# అంతర్‌రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

**చిన్నశంకరంపేట, అక్టోబరు 11, ప్రభాతవార్త:** ఆలయాలలో చోరీలకు పాల్పడుతున్న అంతర్ రాష్ట్ర దొంగలముఠాను పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి శుక్రవారం పట్టుకున్నారు. మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి కథనం ప్రకారం... నాందేడ్‌కు చెందిన దొంగల మూఠా నెలరోజులుగా వివిధ గ్రామా ల్లోని ఆలయాలలో చోరీలకు పాల్పడుతున్నారు. మండల పరిధి గవ్వలపల్లి చౌరస్తాలో శుక్రవారం ఉదయం ఎస్ఐ నారాయణగౌడ్, సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేస్తున్నారు. అనుమానాస్పదం గా ఉన్న టాటామాంజ ఎంహెచ్ 26వీ 2578 కారును ఆపగా వారు ఆపకుండా తప్పించుకుని పరారయ్యారు. ఎస్ఐ కారును వెంబడించి పట్టు కుని తనిఖీ చేయగా కారులో ఆలయాలలోని ఆభర ణాలు, ఇనుప రాడ్డు కనిపించడంతో పోలీసులు ఠాణాకు తరలించి విచారించారు. ఆలయాలలో చోరీలకు పాల్పడుతున్నట్లు వారు అంగీకరించారు. కామారెడ్డి జిల్లా గోపాల్‌పేటలోని రామాలయం, మెదక్ జిల్లా హవేలీఘన్‌పూర్ మండల పరిధి పోచమ్మరాల తండాలో ఇంటి తాళం పగలగొట్టి బంగారం, చిన్నశంకరంపేట మండల పరిధి కొర్వి పల్లిలోని దుర్గామాత ఆలయంలోని అమ్మవారి కిరీ టం, బంగారం, వెండి, ఇత్తడి వస్తువులు, చేగుంట మండల పరిధిలోని చందాయిపేటలోని హనుమాన్ దేవాలయంలో ఆభరాణాలు దొంగిలించారు. అంతటి తో ఆగకుండా చేర్యాలలోని గిఫ్ట్ ఆర్టికల్ దుకాణం లో 60 వేల నగదును ఎత్తుకెళ్లారు. దొంగిలించిన ఆభరణాలను హైదరాబాద్‌లో విక్రయించాలని చూశారు. పోలీసుల తనిఖీల్లో పట్టుపడ్డారు. దొంగి లించిన ఆభరణాల సోత్తు 5లక్షల50వేల రూపాయలు ఉంటుందని, 51 గ్రాముల బంగారు ఆభరణాలు, 1.8 కేజిల వెండి ఆభరణాలు, నగదు రూ.13,700, మూడు చెరవాణీలు, కారును సీజ్‌చేసినట్లు ఆయన వెల్లడించాడు. నెలరోజుల్లో నిందుతులను పట్టు కున్న ఎస్ఐ నారాయణగౌడ్, కానిస్టేబుల్లు రాజ శేఖర్, భాస్కర్‌లను ఆయన అభినందించి నగదు పురస్కారాన్ని అందించారు. తూప్రాన్ డీఎస్పీ వెంకట్ రెడ్డి, రామాయంపేట సిఐ వెంకట్‌రాజాగౌడ్‌లు పాల్గొన్నారు. ఆలయాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఎస్పీ సూచించారు.



వివరాలను వెల్లడిస్తున్న మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి



రాజ్యసభ సభ్యులు డాక్టర్ లక్ష్మణ్ దంపతులకు అమ్మవారి ప్రసాదం అందజేస్తున్న చంద్రశేఖరశర్మ సిద్ధాంతి

## శ్రీవిద్యాధరిని దర్శించుకోవడం పూర్వజన్మ సుకృతం

### -బిజెపి ఒబిసి మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపి లక్ష్మణ్

**వర్గల్, అక్టోబరు 11 (ప్రభాతవార్త):** దేశంలో ఓట్ల రాజకీయాల కోసం లౌకికవాదం పేరిట కొందరు సనాతన ధర్మాన్ని విమర్శించడం పరిపాటిగా మారిందని బిజెపి ఓబిసి మోర్చా జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు డాక్టర్ లక్ష్మణ్ పేర్కొన్నారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా వర్గల్‌లోని శ్రీ విద్యా ధరి క్షేత్రాన్ని కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కష్టకాలంలో ఉన్న దేశాన్ని ప్రధాని నరేంద్రమోడి ఉన్నత శిఖరాలకు చేర్చగా, గతానికి భిన్నంగా ప్రపంచాన్ని శాసించే స్థాయికి చేరువలో ఉన్నట్లు స్పష్టం చేశారు. హిందూ సమాజం జాగృతం కాగా, లౌకికవాదుల చర్యలను అడ్డుకోవడానికి మరింత చైతన్యవంతం కావాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా యువత యాంత్రిక జీవనానికి లోనై వత్తిడి తట్టుకోలేక ధర్మం పట్ల ఆకర్షితులవడం శుభ పరిణామం కాగా, ధర్మాన్ని పరిరక్షిస్తే అది మనల్ని కాపాడుతుందని తెలిపారు. దేవి నవరాత్రుల పర్వదిన సందర్భంగా ప్రధాని నరేంద్రమోడి ఉపవాస దీక్షలో ఉండగా ప్రతి ఒక్కరూ అత్యంత భక్తిశ్రద్ధలతో ఈ పర్వదినం సందర్భంగా చేపట్టే పుణ్యకార్యాల్లో పాల్గొనాలని ఆకాంక్షిం చారు. అలాగే కంచి కామకోటి పీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వర్గల్ శ్రీ విద్యాధరి క్షేత్రం అద్భుతంగా ఉందని, తెలుగు రాష్ట్రాల్లోనే ఈ ఆలయం సుప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా వెలుగొందుతుందని అన్నారు. అంతేకాకుండా ఆధ్యాత్మిక భావన, మానసిక ప్రశాంతతను పంచుతున్న క్షేత్ర సముదా యంలో చక్కటి ఏర్పాట్లు ప్రతి ఒక్కరిని మంత్రముగ్దులను చేస్తుందన్నారు. వర్గల్ క్షేత్రాన్ని దర్శించుకోవడం తన పూర్వజన్మ సుకృతమని, దేవి ఉపాసకులు, క్షేత్ర వ్యవస్థాపక చైర్మన్ యాయవరం చంద్రశేఖరశర్మ సిద్ధాంతి నేతృత్వంలో ప్రధాన క్షేత్రాలకు ధీటుగా వర్గల్ క్షేత్రం రూపుదిద్దుకుంటుందని తెలిపారు. కాగా మొదటగా రాజ్యసభ సభ్యులు డాక్టర్ లక్ష్మణ్ కుటుంబసభ్యు లకు అర్చకులు వేదఆశీర్వాదం, తీర్థప్రసాదాలు అందజేయడంతోపాటు శేషవస్త్రం తో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా బిజెపి అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు గురువారెడ్డి, మండల అధ్యక్షుడు టేకులపల్లి రాంరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు

### ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి

**సంగారెడ్డి బ్యూరో, అక్టోబరు 11 ప్రభాతవార్త:** మెదక్ ప్రజలకు ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి దసరా శుభాకాంక్షలు తెలిపారు చెడుపై మంచి, దుష్టశక్తుల మీద దైవ శక్తులు సాధించిన విజయానికి గుర్తుగా దసరా పండుగ జరుపు కుంటున్నామని అన్నారు. చెడు ఎంత దుర్మార్గమైనదైనా, ఎంత శక్తివంత మైనదైనా అంతిమ విజయం మంచినే వరిస్తుందని మహిషాసురుడిపై జగన్మాత సాధించిన విజయం ప్రపంచానికి చాటిందన్నారు. జగన్మాత ఆశీస్సులతో ప్రజలంతా సుఖశాంతులతో, సిరి సంపదలతో తలతూగాలని, ప్రతి ఒక్క కుటుంబానికి విజయాలు వరించేలా దుర్గామాత దీవించాలని కోరుకున్నారు. దుర్గామాత ఆశీస్సులతో ప్రజలందరికీ శుభాలు కలగాలని, అన్నింటా విజయాలు సిద్ధించాలని కోరుకుంటూ ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి విజయ దశమి శుభాకాంక్షలు తెలిపారు.

## నియోజకవర్గ ప్రజలు సంతోషంగా ఉండాలి

### మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్

**హుస్నాబాద్ రూరల్, అక్టోబరు 11, ప్రభాతవార్త :** హుస్నాబాద్ నియో జక వర్గ ప్రజలు సుఖసంతోషాలతో సుభీక్షంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్ ఆకాంక్షించారు. శుక్రవారం వారి నివాసంతో జరుగు తున్న అమ్మవారి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని పురస్కరించుకుని మాజీ రాజ్యసభ సభ్యులు కెప్టెన్ లక్ష్మీకాంతరావు కుటుంబ సభ్యులతో కలసి పూజా కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని పూలమాలతో సుందరంగా అలరించారు. శ్రీసూక్త, దుర్గ సూక్త పఠపంలో అమ్మవారిని కొలిచారు. అనంతరం సతీష్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అత్యంత ప్రాధాన్యతగా నవరాత్రి ఉత్సవాలు జరుగుతున్నాయన్నారు. ఈ ఉత్సవాలలో అమ్మవారిని నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని వేడుకున్నట్లు తెలియజేశారు. నియోజకవర్గ ప్రజలందరికీ దసరా, విజయదశమి శుభాకాంక్షలు తెలియజేశారు.



పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్

## సుఖాంతమైన పసికందు కిడ్నాప్ కేసు

### -30 గంటల్లో కేసును ఛేదించిన పోలీసులు

### -తల్లిఒడికి చేరిన నవశిశువు

**సంగారెడ్డి టౌన్, అక్టోబరు 11, ప్రభాతవార్త:** జిల్లా కేంద్రమైన సంగారెడ్డి లోని ప్రభుత్వ ఆసుపత్రినుంచి కిడ్నాప్‌కు గురైన నవజాత పసికందు కేసును సంగారెడ్డి పోలీసులు 30 గంటల్లో ఛేదించి అందరిచే శభాష్ అనిపించు కున్నారు. ఇందుకు సంబంధించి సంగారెడ్డి డిఎస్‌పి సత్యయ్య గౌడ్ ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వెల్లడించిన వివరాలు ప్రకారం... ఈ నెల 9న మధ్యాహ్నం ప్రభుత్వ ఆసుపత్రి నుంచి అప్పుడు జన్మించిన నవజాత శిశువును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. బాధితులు సంగారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేయగా జిల్లా ఎస్‌పి రూపేష్ చెన్నూరి సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించి కేసును ఛేదించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ప్రత్యేక బృందాలు టెక్నికల్ (ఐటి సెల్) టీం సహాయంతో సిసి టీవి పుటేజీల ఆధారంగా నలుగురు వ్యక్తులు శిశువును అపహరించుకుపోయినట్లు గుర్తించారు. వీరు హైదరాబాద్‌లోని బోరబండలో ఉన్నట్లు గుర్తించి సంఘటన స్థలానికి చేరుకుని కిడ్నాప్‌కు గురైన పసిపాపను, నిందితులు రుక్సానా బేగం, నయిదా బేగం, ముస్కాన్, జువేరియా ఫాతిమాలను అదుపులోకి తీసుకుని సంగారెడ్డికి తరలించారు. కిడ్నాప్‌కు గురైన పసిపాపను తల్లికి అప్పగించారు. బాధితులు సంగారెడ్డి పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. కేసును తమదైన శైలిలో త్వరగా ఛేదించిన సదాశివపేట, పటాన్‌చెరు ఇన్స్‌పెక్టర్‌లు మహేష్ గౌడ్, ప్రవీణ్‌రెడ్డి, సిసిఎస్ ఎస్ఐ శ్రీకాంత్, ఎస్ఐ విజయ్‌గౌడ్, వవినయ్, హరిశంకర్ గౌడ్, సిసిఎస్ టీం, ఐటి సెల్ సిబ్బందిని జిల్లా ఎస్‌పి ప్రత్యేకంగా అభినందించారు.

